RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 104 | మే 06 బుధవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 104 | May 06 Wednesday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

**సుమారు 3,000 మందికి కొత్త ఉద్యోగ అవకాశాలు**
2

# 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0'

## 9 రాష్ట్రాల్లో సోదాలు

**హైదరాబాద్ జనసంఘర్షణ**
హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దేశవ్యాప్తంగా చేపట్టిన 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0' సంచలనం సృష్టించింది. తొమ్మిది రాష్ట్రాల్లో ఏకకాలంలో నిర్వహించిన ఈ విస్తృతమైన దాడుల్లో మొత్తం 56 మంది సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వీరికి దాదాపు 101 సైబర్ నేరాలతో సంబంధం ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. అరెస్టు అయిన వారిలో బ్యాంకింగ్ వ్యవస్థకు చెందిన కీలక వ్యక్తులు ఉండటం ఈ కేసులో ప్రధానాంశం. అదుపులోకి తీసుకున్న వారిలో 32 మంది బ్యాంక్ మేనేజర్లు, కేవైసీ అప్రూవర్లు, రిలేషన్ షిప్ మేనేజర్లు మరియు ఫీల్డ్ ఆఫీసర్లు ఉన్నారు. వీరు కాకుండా 15 మంది మ్యూల్ అకౌంట్ హోల్డర్లు, 9 మంది అకౌంట్ ఆపరేటర్లు కూడా పోలీసులకు చిక్కారు. ఈ నేరగాళ్ల వల్ల బాధితులు సుమారు రూ. 9.13 కోట్ల నగదును కోల్పోయినట్లు పోలీసులు గుర్తించారు. బాధితుల నుంచి సేకరించిన సమాచారంతో అప్రమత్తమైన అధికారులు, అందులో రూ. 69.99 లక్షలను తిరిగి బాధితులకు రీఫండ్ చేయించగలిగారు. నేర స్వభావాన్ని బట్టి చూస్తే, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసుల్లో 17 మందిని, ట్రేడింగ్ ఫ్రాడ్ కేసుల్లో

➤ మిగతా 2వ పేజిలో..

## బెంగాల్, అసోం ఎన్నికల ఫలితాలపై ప్రధాని మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభినందనలు

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ మరియు అసోం రాష్ట్రాల్లో సాధించిన ఘనవిజయం పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం చారిత్రాత్మకమని, అత్యంత కీలకమైనదని వైట్ హౌస్ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది.

➤ మిగతా 2వ పేజిలో..

# ప్రాణహిత-చేవెళ్ల ను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలి

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి భూమి



**గంభీరావుపేట జనసంఘర్షణ**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో బయోస్ట్రాట్రమ్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు మరియు పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో, ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో రూపొందించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని నాటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని ప్రస్తుత ప్రభుత్వం నెరవేర్చాల్సిన బాధ్యత ఉందని ఆయన గుర్తు చేశారు. 2014 తర్వాత బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినప్పటికీ, తెలంగాణలో ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా ఆ హోదా కల్పించకపోవడం రాష్ట్రం పట్ల కేంద్రం చూపిస్తున్న వివక్షకు నిదర్శనమని భట్టి విక్రమార్క ఆరోపించారు. ధాన్యం కొనుగోలు మరియు రైతు సంక్షేమం విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును కూడా ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ రైతులు పండించిన పంటను కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు

➤ మిగతా 2వ పేజిలో..

# తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన..

**అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక**



**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. ప్రస్తుతం తెలంగాణ, రాయలసీమ మరియు తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు విస్తరించి ఉన్న ఉపరితల ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు రెండు రాష్ట్రాల్లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఈ అకాల వర్షాలతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వాతావరణంలో మార్పులు సంభవించనున్నాయి. ముఖ్యంగా పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. వీటితో పాటు తిరుపతి, చిత్తూరు, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో కూడా వర్షాలకు అవకాశం ఉంది. గత సోమవారం ప్రకాశం, పార్వతీపురం మన్యం, తిరుపతి మరియు చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచగా, పలుచోట్ల పిడుగులు పడినట్లు సమాచారం. ఇదిలా ఉంటే, రాష్ట్రంలో ఒకవైపు వర్షాలు కురుస్తున్నా, మరోవైపు ఎండల తీవ్రత కూడా కొనసాగుతోంది. కృష్ణా జిల్లాలో గరిష్టంగా 43.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవగా, అనేక మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు

➤ మిగతా 2వ పేజిలో..

## ప్రధానమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

**హైదరాబాద్ జనసంఘర్షణ**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 10వ తేదీన తెలంగాణలో పర్యటించనున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ పర్యటనను విజయవంతం చేసేందుకు మరియు భద్రతా పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రధాని పర్యటనలో భాగంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు మరియు బహిరంగ సభ ఉండటంతో, అందుకు తగిన విధంగా అన్ని శాఖల అధికారులను ఆయన అప్రమత్తం చేశారు. సమీక్షలో భాగంగా సీఎస్ రామకృష్ణారావు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించి 'బ్లూ బుక్'లో పేర్కొన్న నిబంధనల ప్రకారం భద్రతను అత్యంత కట్టుదిట్టంగా అమలు చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ మరియు బందోబస్తు ఏర్పాట్లలో

➤ మిగతా 2వ పేజిలో..

## దేశాభివృద్ధికి పెద్దపీట

**కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు - రూ. 1.52 లక్షల కోట్ల నిధుల కేటాయింపు**



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
దేశ సమగ్రాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన మరియు వివిధ రంగాల బలోపేతమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం అత్యంత కీలకమైన నిర్ణయాలను తీసుకుంది. ఈ సమావేశంలో దాదాపు రూ. 1,52,702 కోట్ల నిధులను వివిధ ప్రాజెక్టుల కోసం మంజూరు చేస్తూ కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వ్యవసాయం, రైల్వే, సెమీకండక్టర్లు మరియు న్యాయవ్యవస్థ వంటి రంగాల్లో తీసుకున్న ఈ నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునివ్వనున్నాయి. రైతు సంక్షేమానికి అగ్రతాంబూలం

రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. చెరకు రైతులకు తీపి కబురు చెబుతూ, 2026-27 సంవత్సరానికి గాను 'ఫెయిర్ అండ్ రెమ్యూనరేటివ్ ప్రైస్' కోసం ఏకంగా రూ. 1 లక్ష కోట్లను కేటాయించింది. అలాగే, పత్తి సాగును ప్రోత్సహించేందుకు మరియు దిగుబడిని పెంచేందుకు 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ' కింద రూ. 5,659 కోట్లను మంజూరు చేసింది. ఈ నిర్ణయాలు వ్యవసాయ రంగంలో

➤ మిగతా 2వ పేజిలో..

# ప్రాణహిత-చేవెళ్ల ను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలి

**మొదటిపేజీ తరువాయి..**
చేస్తోందని, కానీ కేంద్రం మాత్రం ధాన్యం సేకరణలో కొర్రీలు పెడుతూ, నిధుల విడుదలలో జాప్యం చేస్తూ రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. కేవలం కొన్ని పంటలకు మాత్రమే మద్దతు ధర ప్రకటించి మిగిలిన వాటి విషయంలో కేంద్రం తప్పించుకోవాలని చూడటం సరికాదని, రాష్ట్రం సేకరించిన ప్రతి గింజను కేంద్రమే సేకరించి సకాలంలో నిధులు విడుదల చేయాలని ఆయన స్పష్టం చేశారు.
పర్యావరణ పరిరక్షణ మరియు వ్యవసాయ అభివృద్ధిపై మాట్లాడుతూ, పంట కోతల అనంతరం రైతులు వరి గడ్డిని పొలాల్లోనే కాల్చివేయడం వల్ల వాతావరణం కలుషితమవుతోందని, ఇలాంటి పద్ధతులను నివారించేందుకు ప్రభుత్వం బయో గ్యాస్ ప్లాంట్లను ప్రోత్సహిస్తోందని తెలిపారు. పంట వ్యర్థాలను బయో గ్యాస్ ప్లాంట్లకు సరఫరా చేయడం వల్ల పర్యావరణానికి రక్షణ కలగడమే కాకుండా, రైతులకు అదనపు ఆదాయం కూడా లభిస్తుందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా క్లీన్ ఎనర్జీపై చర్చ జరుగుతున్న తరుణంలో మన రైతాంగం కూడా ఆధునిక దిశగా అడుగులు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు రైతులు కేవలం వరిపైనే ఆధారపడకుండా, పంట మార్పిడి విధానాన్ని పాటించాలని, ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్‌పామ్ వంటి లాభదాయకమైన పంటల వైపు దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఆధునిక సాగు పద్ధతులను అలవర్చుకోవడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని, పాత పద్ధతులకు స్వస్తి పలికి రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి అందరూ సహకరించాలని భట్టి విక్రమార్క కోరారు.

# ‘ఆపరేషన్ ఆక్టోపస్ 2.0’

**మొదటిపేజీ తరువాయి..** 30 మందిని, డిజిటల్ అరెస్ట్ కేసులో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 34 మొబైల్ ఫోన్లు, 8 చెక్ బుక్కులు, 11 షెల్ కంపెనీ స్టాంపులు, ఒక ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు.
రాష్ట్రాల వారీగా నిందితుల వివరాలను పరిశీలిస్తే, తెలంగాణ నుండి అత్యధికంగా 17 మంది, మహారాష్ట్ర నుంచి 14 మంది, ఢిల్లీ నుంచి 9 మంది, కర్ణాటక నుంచి నలుగురు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరు అరెస్టయ్యారు. ఈ ఆపరేషన్ లో భాగంగా సైబర్ పెట్రోలింగ్ చేపట్టిన పోలీసులు, అక్రమ బెట్టింగ్ మరియు నకిలీ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్న 184 సోషల్ మీడియా ప్రొఫైళ్లను తొలగించారు. సీ-మిత్ర ద్వారా 1250 కాల్స్ చేసి ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా, 194 జీరో ఎఫ్ఐఆర్లను కూడా నమోదు చేశారు.
ఇక ఒక కేసులో ప్రత్యేకంగా కోల్‌కతాకు చెందిన ఇండస్‌ఇండ్ బ్యాంక్ కీ అకౌంట్ మేనేజర్ మొహమ్మద్ రియాజుద్దీన్ మరియు అసిస్టెంట్ మేనేజర్ మనీష్ ప్రసాద్ విశ్వకర్మను పోలీసులు అరెస్టు చేశారు. గేమింగ్ ఫ్రాడ్ పేరుతో ఓ బాధితురాలిని మోసం చేసి రూ. 74.99 లక్షలు కాజేసిన కేసులో వీరిద్దరి పాత్ర ఉన్నట్లు విచారణలో తేలింది. సైబర్ నేరాలను అరికట్టేందుకు హైదరాబాద్ పోలీసులు చేపట్టిన ఈ ఆపరేషన్ దేశవ్యాప్తంగా నేరగాళ్లకు హెచ్చరికగా నిలుస్తోంది.

# తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన..

**మొదటిపేజీ తరువాయి..** నమోదై ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇక తెలంగాణలో కూడా రాబోయే మూడు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే సూచనలు ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరింది. సోమవారం కొన్ని జిల్లాల్లో వడగళ్ల వాన కురిసి పంటలకు నష్టం కలిగించింది. ఇటీవల ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల జిల్లాల్లో 2 నుంచి 7 సెంటీమీటర్ల వరకు భారీ వర్షపాతం నమోదైంది. ఈ అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతుండటంతో, రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని గమనిస్తూ రైతులకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తోంది. పిడుగుల ప్రమాదం ఉన్నందున ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో ఎవరూ చెట్ల కింద ఆశ్రయం తీసుకోకూడదని, సురక్షితమైన ప్రదేశాల్లో ఉండాలని ప్రజలకు అధికారులు విజ్ఞప్తి చేశారు. వాతావరణ మార్పుల దృష్ట్యా రాబోయే రోజుల్లో బయటకు వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## టెన్త్‌లో సత్తా చాటిన అనాథ బాలుడు

**విద్యార్థి పవన్‌ను అభినందిస్తూ డిప్యూటి సిఎం పోస్ట్**

**అమరావతి, మే5 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ’భగవంతుని పిల్లలు పేరుతో తల్లిదండ్రులు లేని పిల్లలను కొంతమందిని ఎంపిక చేసి, వారికి తన జీతం నుంచి ప్రతి నెలా రూ. 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నారు. పవన్ ఆర్థిక సాయం అందిస్తున్న ఓ బాలుడు పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటాడు. ఏకంగా 555 మార్కులు సాధించాడు. యు. కొత్తపల్లి మండలం, కొత్త ఇసుకపల్లి గ్రామానికి చెందిన ఆకుల పవన్ కుమార్ 555 మార్కులు సాధించాడు. పవన్ కుమార్ పదో తరగతి పరీక్షల్లో 555 మార్కులు సాధించటంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తరఫున ఏపీ డిప్యూటీ సీఎంఓ అభినందనలు తెలియజేసింది. ఈ మేరకు మంగళవారం ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది. ఆ పోస్టులో.. ’పిఠాపురం నియోజకవర్గం, యూ. కొత్తపల్లి మండలం, కొత్త ఇసుకపల్లి గ్రామానికి చెందిన ఆకుల పవన్ కుమార్ మొన్న విడుదలైన 10వ తరగతి పరీక్షల్లో 555 మార్కులు సాధించినందుకు హృదయపూర్వక అభినందనలు. అందుకుంటున్న భగవంతుని పిల్లల్లో ఒకరైన పవన్ కుమార్ భవిష్యత్తులో

# ప్రధానమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

**మొదటిపేజీ తరువాయి..** ఏమాత్రం పొరపాట్లు జరగకూడదని స్పష్టం చేశారు. బేగంపేట విమానాశ్రయం, హెలిప్యాడ్లు మరియు ప్రధాని పాల్గొనే బహిరంగ సభా వేదికల వద్ద తగిన సంఖ్యలో అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచాలని ఫైర్ సర్వీసెస్ శాఖను, అలాగే అత్యవసర వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలని ఆరోగ్య శాఖను ఆదేశించారు.
ప్రధాని కాన్వాయ్ ప్రయాణించే మార్గాల్లో రోడ్లను తనిఖీ చేసి, ఏవైనా మరమ్మతులు అవసరమైతే వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని పోలీసు, జీహెచ్ఎంసీ మరియు రోడ్లు భవనాల శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. పర్యటన సాగే అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అన్ని శాఖల మధ్య సమన్వయం ఉంటేనే ఈ పర్యటన విజయవంతం అవుతుందని సీఎస్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ అనిల్ కుమార్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, వివిధ శాఖల ఉన్నతాధికారులు మరియు కమిషనర్లు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధికి పెద్దపీట

**మొదటిపేజీ తరువాయి..** స్వయం సమృద్ధిని సాధించడంలో కీలకం కానున్నాయి. సాంకేతికత, మౌలిక సదుపాయాల బలోపేతం
టెక్నాలజీ రంగంలో భారత్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు భారీ ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఇందులో భాగంగా క్రిస్టల్ మ్యాట్రిక్స్ లిమిటెడ్ యూనిట్ కోసం రూ. 3,068 కోట్లు, సుచి సెమికాన్ ప్రైవేట్ లిమిటెడ్ కోసం రూ. 868 కోట్లు కేటాయించారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రైల్వే నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు పలు లైన్లకు ఆమోదం తెలిపారు. ముఖ్యంగా నగద - మథుర రైల్వే లైన్ నిర్మాణానికి రూ. 16,403 కోట్లు, గుంతకల్ - వాడి లైన్ కోసం రూ. 4,758 కోట్లు, మరియు బుర్హ్వాల్ - సీతాపూర్ రైల్వే లైన్ కోసం రూ. 2,276 కోట్లు కేటాయించడం జరిగింది. ఈ ప్రాజెక్టులు ప్రయాణికులకు, రవాణా రంగానికి ఎంతో మేలు చేకూరుస్తాయి.
న్యాయవ్యవస్థలో సంస్కరణలు మరియు ఇతర ప్రాజెక్టులు
దేశ అత్యున్నత న్యాయస్థానం పనితీరును మరింత మెరుగుపరచడానికి, కేసుల పెండింగ్‌ను తగ్గించడానికి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను 33 నుండి 37కి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల న్యాయం వేగవంతం కానుంది. వీటితో పాటు, ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ స్కీమ్ కోసం రూ. 18,100 కోట్లు మరియు షిప్పింగ్ రంగంలో ఓడల మరమ్మత్తుల సౌకర్యాల అభివృద్ధికి రూ. 1,570 కోట్లు కేటాయించడం జరిగింది. ఈ భారీ కేటాయింపులు దేశ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడంతో పాటు, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించే అవకాశం ఉందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

## బెంగాల్, అసోం ఎన్నికల ఫలితాలపై ప్రధాని మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభినందనలు

**మొదటిపేజీ తరువాయి..** ప్రధాని మోదీకి పంపిన అభినందన సందేశంలో, వీరిద్దరి మధ్య ఉన్న బలమైన స్నేహాన్ని ట్రంప్ ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు. “నా మిత్రుడు నరేంద్ర మోదీకి ఈ గొప్ప విజయం దక్కినందుకు నా హృదయపూర్వక అభినందనలు. భారతదేశం వంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు, ఆయన నాయకత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనం” అని ఆయన పేర్కొన్నారు. ‘హౌడీ మోదీ’, ‘నమస్తే ట్రంప్’ వంటి కార్యక్రమాల ద్వారా వీరిద్దరి మధ్య నెలకొన్న సాన్నిహిత్యం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే చర్చనీయాంశమైన విషయం తెలిసిందే.

ఈ విజయం కేవలం భారత్‌కే కాకుండా, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వానికి కూడా ఎంతో కీలకమని వైట్ హౌస్ తన ప్రకటనలో అభిప్రాయపడింది. ప్రధాని మోదీ పటిష్టమైన నాయకత్వంలో భారత్-అమెరికా దేశాల మధ్య ఉన్న ‘సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యం’ మరింత బలోపేతం అవుతుందని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య, రక్షణ రంగాల్లో సహకారాన్ని మరింత వేగవంతం చేసే దిశగా అడుగులు పడనున్నాయి.
ఈ అభినందనలపై స్పందించిన ప్రధాని మోదీ, అమెరికాతో కలిసి ప్రపంచ అభివృద్ధి, శాంతి కోసం మరింత సమర్థవంతంగా పనిచేస్తామని పునరుద్ఘాటించారు. పశ్చిమ బెంగాల్‌లో తొలిసారిగా, అసోంలో వరుసగా మూడవసారి బీజేపీ విజయం సాధించడంపై అంతర్జాతీయ సమాజం ప్రత్యేక ఆసక్తిని కనబరుస్తోంది.

## మోత్కూరులో రైతుల రాస్తారోకో

**యాదాద్రి భువనగిరి, మే5 :** ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. చేతికొచ్చిన పంట కండ్ల ముందే వర్షార్పణం అవుతుంటే కడుపుమండిన రైతులు రోడ్లపై కొచ్చి ఆందోళనలు చేపడుతున్నారు. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## ప్రముఖ నిర్మాత ఆర్‌బీ చౌదరి దుర్మరణం

**రాజస్థాన్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి**

**హైదరాబాద్, మే5 :** చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నిర్మాత ఆర్‌బీ చౌదరి (76) దుర్మరణం చెందారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. సూపర్ గుడ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై తమిళ, తెలుగు, మలయాళంలో ఎన్నో విజయవంతమైన చిత్రాలను ఆయన నిర్మించారు. పలు సినిమాలను డిస్ట్రిబ్యూట్ చేశారు. ’రంగం’ ఫేమ్ హీరో జీవా.. ఆర్‌బీ చౌదరి తనయుడే. మరో తనయుడు రమేశ్ ’విద్యార్థి’ చిత్రంలో హీరోగా నటించారు. వీరితోపాటు మరో ఇద్దరు కుమారులున్నారు. రాజస్థానీ అయిన ఆర్‌బీ చౌదరి 1950లో మద్రాసులో జన్మించారు. పూర్తి పేరు రతన్‌లాల్ భగత్‌రామ్ చౌదరి. సినిమాల్లోకి రాకముందు స్టీల్, జ్యువెల్లరీ తదితర వ్యాపారాలు నిర్వహించారు. ఆయన నిర్మించిన తొలి సినిమా ’ఆదిపాపమ్’ (మలయాళం). 1988లో విడుదలైంది. 1990లో ’పుదు వసంతం’తో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ’నవ వసంతం’ పేరుతో తెలుగులో రీమేక్ చేశారు. ’సుస్వాగతం’తో ఘన విజయాన్ని అందుకున్నారు. అది మొదలు ’సూర్యవంశం’, ’రాజా’, ’శీను’, ’నువ్వు వస్తావని’, ’నిన్నే ప్రేమిస్తా’, ’ప్రియమైన నీకు’, ’శివరామరాజు’, ’గోరింటాకు’, ’సంక్రాంతి’.. ఇలా కుటుంబమంతా కలిసి చూడదగ్గ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. ’శుభాకాంక్షలు’లాంటి హిట్ సినిమాలకు సమర్పకుడిగానూ వ్యవహరించారు. టాలీవుడ్‌లో రీమేక్ సినిమాలతోనే ఆర్‌బీ చౌదరి ఎక్కువగా విజయాలు అందుకున్నారు. దీనికి గల కారణాన్ని ఓ సందర్భంలో తెలిపారు. తనకు తమిళం బాగా వచ్చు కాబట్టి తొలుత కోలీవుడ్‌లో నిర్మిస్తానని, వాటిలో తెలుగు ప్రేక్షకులను మెప్పించే అంశాలుంటే తప్పక రీమేక్ చేస్తుంటానని చెప్పారు. సూపర్‌గుడ్ ప్రొడక్షన్స్, సూపర్‌గుడ్ కంబైన్స్, మెగా సూపర్ గుడ్‌ఫిల్మ్స్.. బ్యానర్ల పేర్లు మారినా ఆయన సినిమాల్లోని వినోదం మాత్రం తగ్గలేదు. ఆయన నిర్మాణంలో గతేడాది 99వ సినిమా ’మకుటం’ మొదలైంది. ఇందులో విశాల్ హీరో.

## హైదరాబాద్‌లో బీఏఎస్‌ఎఫ్ గ్లోబల్ సర్వీస్ హబ్

**తెలంగాణ ప్రభుత్వంతో కీలక ఒప్పందం**

**సుమారు 3,000 మందికి కొత్త ఉద్యోగ అవకాశాలు**

**ఐటీ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**

**హైదరాబాద్, మే5 :** హైదరాబాద్‌లో జర్మనీకి చెందిన అంతర్జాతీయ దిగ్గజం బీఏఎస్‌ఎఫ్ గ్లోబల్ సర్వీస్ హబ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈమేరకు తెలంగాణ ప్రభుత్వానికి కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 3,000 మందికి కొత్త ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఐటీ మంత్రి శ్రీధర్ బాబుకు సంస్థ ప్రతినిధులు లెటర్ ఆఫ్ ఇంటెంట్ అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించనున్నట్లు ప్రకటించారు. ఈ హబ్ ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్సెస్ సేవలకు వ్యూహాత్మక కేంద్రంగా పని చేయనుంది. గ్లోబల్ సర్వీస్ డెలివరీ నెట్‌వర్క్‌కు హైదరాబాద్ కీలక కేంద్రంగా మారనుంది. 160 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ అంతర్జాతీయ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 200 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్‌లో భారీ పెట్టుబడి ద్వారా తన సేవలను మరింత విస్తరించనుంది. తెలంగాణలో మరో మెగా గ్లోబల్ కంపెనీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడంపై ప్రభుత్వం సంతోషం వ్యక్తం చేసింది. హైదరాబాద్‌పై అంతర్జాతీయ కంపెనీల నమ్మకం మరింత పెరుగుతోందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం నాడు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జర్మన్ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ ల సమక్షంలో బిఎఎస్ ఎఫ్ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు టోబియాస్ డ్రాట్ తెలంగాణ లైఫ్‌సైన్సెస్ సీఈఓ సర్వేశ్ సింగ్ కు లెటర్ ఆఫ్ ఇంటెంట్ అందజేసారు. సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఈ ఏడాది 100 జిసిసిల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. వీటి ద్వారా లక్ష మంది ఐటి నిపుణులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. హైదరాబాద్ కేవలం కార్యాలయాల కేంద్రంగా మాత్రమే కాకుండా, ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ రంగాల్లో ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తున్నట్టు శ్రీధర్ బాబు తెలిపారు. ఇందులో భాగంగా కృత్రిమ మేథస్సు ఆధారిత కేంద్రం ఐకామ్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, 200 ఎకరాల్లో ఏఐ సిటీ, క్వాంటమ్ హబ్, జీవ విజ్ఞాన పరిశోధన్ సంస్థ ’1 బయోల్యాబ్’ లను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. 160 సంవత్సరాల చరిత్ర కలిగిన బిఎఎస్ ఎఫ్ ప్రపంచవ్యాప్తంగా 200కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 234 కర్మాగారాలు, 1,08,000 మంది ఉద్యోగులతో పనిచేస్తున్న ఈ సంస్థ వార్షిక ఆదాయం దాదాపు 5 లక్షల కోట్ల రూపాయలు (60 బిలియన్ డాలర్లు). ప్రపంచంలోని పలు నగరాలతో పోటీ పడి హైదరాబాద్ ఈ ప్రతిష్మాత్మక అవకాశాన్ని దక్కించుకోవడం రాష్ట్రానికి దక్కిన గౌరవం. న్విడియా, మైక్రోసాఫ్ట్, గూగుల్, వాన్‌గార్డ్, ఎలీ లిల్లీ,

# హత్యాయత్నం కేసులో భర్తకు 7 ఏళ్ల జైలు శిక్ష

- పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.
- నిందితునికి శిక్ష పడే వరకు కృషి చేసిన సిబ్బందిని అభినందించిన పోలీస్ కమిషనర్

బోధన్ :మే 05 జన సంఘర్షణ


వివరాల్లోకి వెళితే జక్రాన్ పల్లి మండలానికి చెందిన మహిళకు 2023లో ప్రదీప్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే భర్త ప్రదీప్ మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని, అదనపు కట్నం కోసం భార్యను తరచూ వేధిస్తూ, కొట్టేవాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో 11-04-2025 రాత్రి, "ఎవరితో ఫోన్‌లో మాట్లాడుతున్నావు" అని భార్య ప్రశ్నించగా, కోపోద్రిక్తుడైన భర్త ఆమెను హత్య చేయాలనే ఉద్దేశంతో చీరతో మెడకు చుట్టి ఉక్కిరిబిక్కిరి చేయడానికి ప్రయత్నించినట్లు వెల్లడైంది. ఈ ఘటనపై బాధితురాలు జక్రానపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు అనంతరం కోర్టులో విచారణ జరగగా, నేరం రుజువైందని నిర్ధారించిన గౌరవ న్యాయమూర్తి డి. దుర్గాప్రసాద్ ముద్దాయి ప్రదీప్‌కు 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ తీర్పు గృహ హింస, కట్న వేధింపులపై కఠిన చర్యలు తీసుకుంటామని న్యాయవ్యవస్థ మరోసారి స్పష్టం చేసినట్లైంది. ఈ కేసులో కృషిచేసిన మొదటి ఐ.ఓ సిహెచ్. తిరుపతి (ఎస్.ఐ) , రెండవ ఐ.ఓ ఎమ్. డి మాలిక్ రహమాన్ (ఎస్.ఐ ), బ్రీఫింగ్ చేసిన జి. మహేష్ ( ఎస్.ఐ ), టి. గోవింద్ ( ఎస్. ఐ కోర్టు లైయషన్ ఆఫీసర్ ) , వి. రామారావు ( కోర్టు డ్యూటీ ఆఫీసర్ ) మొదలగు వారిని నిజామాబాదు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఐపీఎస్. అభినందించారు

# అయిల్ ఫామ్ పంటతో అధిక లాభాలు

- పంట మార్పిడి చేస్తూ నూతన వంగడాలపై దృష్టి పెట్టాలి
- ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

భైంసా, మే 5 (జన సంఘర్షణ)

రైతులు అయిల్ ఫామ్ పంటను వేసి అధిక లాభాలు సాధించాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు. మంగళవారం భైంసాలోని శ్రీ బంకెట్ హల్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు వారోత్సవ కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అయిల్ ఫామ్ పంట వేయాలని రైతులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీని సద్వినియోగం చేసుకొని పంట వేయాల్సిందిగా సూచించారు.. నియోజకవర్గం లో ప్రస్తుతం 4200 ఎకరాల్లో రైతులు పంటను వేయడం జరిగిందన్నారు. పంట వేసినప్పటినుండి మూడు సంవత్సరాల వరకు అంతర పంటలు వేసుకోవచ్చాన్నారు. 20 వేల ఎకరాల వరకు వరకు పంట వేస్తె భవిష్యత్తు లో మన ప్రాంతం లో అయిల్ ఫామ్ ఇండస్ట్రీ వచ్చే అవకాశం ఉందన్నారు.. ఉపాధి హామీ పథకం లో రైతుల కోసం ఎన్నో స్కీమ్ లు ఉన్నాయని వాటిని వివరించాల్సిన



బాధ్యత అధికారుల పై ఉందన్నారు. పంట మార్పిడి తో రైతులు లాభాల బాట పడతారని ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని,రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడితే ప్రజల ఆరోగ్యాలకు ప్రమాదకరమన్నారు. అనంతరం కార్యక్రమం లో ఉత్తమ రైతులను సన్మానించారు. అధికారులు అయిల్ ఫామ్ పంట పై ప్రెజెంటేషన్ ఇచ్చి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్థాళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ బాలు నాయక్, ఎడిఎ లు వీణ శ్రీనివాస్ రాజు, ఉద్యానవన శాఖ అధికారి జావీద్ పాషా, వ్యవసాయ శాఖ అధికారులు, పలువురు సర్పంచ్ లు రైతులు పాల్గొన్నారు.

# యోగాతో ఆత్మవిశ్వాసం సంపూర్ణ ఆరోగ్యం

- ప్రముఖ యోగ శిక్షకురాలు తనశ్రీ

భైంసా, మే 5 (జన సంఘర్షణ)

యోగతోనే ఆత్మవిశ్వాసం సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రముఖ యోగా శిక్షకురాలు తనశ్రీ తెలిపారు. భైంసా పట్టణంలోని ఏపీ నగర్ కాలనీకు చెందిన తనశ్రీ యోగా శిక్షణలో ఉపాధ్యాయులుగా వైసీ 3 గ్రేడ్ వన్ శిక్షణ పూర్తి చేసుకున్నారు. సందర్భంగా యోగ ప్రయోజనాలను వివరించారు. యోగ అనేది శరీరాన్ని, మనస్సును, ఆత్మను అనుసంధానించే ఒక అద్భుతమైన ప్రక్రియ అని తెలిపారు. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందన్నారు. యోగ వల్ల శారీరక ప్రయోజనాలు అధికంగా ఉన్నాయని అన్నారు. యోగాసనాలు వేయడం వల్ల శరీర, కండరాల దృఢత్వం పెరుగుతుందన్నారు. శరీరంలోని వివిధ భాగాలను ఉత్తేజితం చేయడం ద్వారా కండరాలు బలపడతాయని తెలిపారు. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడి రక్తపోటు నియంత్రణలో ఉంటుందని పేర్కొన్నారు. ప్రాణాయామం, ఆసనాల ద్వారా శరీరంలోని విషతుల్యాలు బయటకు వెళ్లి, రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ధ్యానం, శ్వాసక్రియల ద్వారా



మానసిక ఒత్తిడి, ఆందోళన గణనీయంగా తగ్గుతాయన్నారు. యోగా వల్ల మనస్సు ప్రశాంతంగా మారి చేసే పనులపై ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని సూచించారు. నిద్రలేమితో బాధపడేవారికి యోగా ఒక అద్భుతమైన పరిష్కారమని ఇది ప్రశాంతమైన నిద్రకు తోడ్పడుతుంది. సూర్య నమస్కారాలు వంటి ప్రక్రియలు శరీరంలోని అదనపు కొవ్వును కరిగించి, బరువును అదుపులో ఉంచుతాయి అన్నారు. ప్రాణాయామం ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచి, శ్వాస సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది. క్రమశిక్షణతో కూడిన యోగా అభ్యాసం వల్ల వ్యక్తిలో సానుకూల దృక్పథం ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో యోగ ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని ప్రతి ఒక్కరూ యోగ పట్ల ఆసక్తికరచాలని తెలియజేశారు. శిక్షణను పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. యువతులు, మహిళలకు యోగకు సంబంధించిన ప్రాథమిక జ్ఞానాన్ని అందించి దీర్ఘకాలిక అనారోగ్యాల బారిన పడకుండా సలహాలు సూచనలు ఇస్తానన్నారు.

## న్యాయం చేయాలంటూ అక్బర్ నగర్ జిపి కార్యాలయం ఎదుట మహిళా నిరసన

రుద్రూరు /మే5/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా రుద్దురు మండలం అక్బర్ నగర్ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట కవిత అనే మహిళ తనకు న్యాయం చేయాలంటూ నిరసన చేపట్టింది. మంగళవారం ఉదయం ఆమె జిపి ఎదుట ప్రస్తుతం కూర్చొని నిరసన చేయడం జరుగుతుంది. తన స్థలాన్ని కబ్జా చేయడమే కాకుండా తనపై ఆకారణంగా దాడి చేసిన వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రతిరోజు న్యాయం కోసం నిరీక్షణ చేస్తున్నామని తనకు న్యాయం చేయాలని కోరింది, తనకు న్యాయం జరిగేంత వరకు జిపి ఎదుట తన నిరసన కొనసాగిస్తానని కవిత తెలిపారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ప్రజా ట్రస్ట్ చైర్మన్

కుంటాల, మే 5 (జన సంఘర్షణ)



కుంటాల మండలం కల్లూరు గ్రామానికి చెందిన సురేందర్ గుండెపోటుతో ఇటీవల మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న మోహన్ రావు పటిల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లె మోహన్ రావు పటిల్ వారి కుటుంభ సభ్యులకు పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని బాధిత కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వడం జరిగింది. వారితో గ్రామస్తులు ఉన్నారు.

## వ్యక్తిగత స్వార్థమా? ప్రజా సౌకర్యమా? రాజుపేట డ్రైనేజీ పనులకు 'మెట్ల' అడ్డంకి!

భద్రాచలం మే 05 (జన సంఘర్షణ)



పట్టణంలోని 20వ వార్డు రాజుపేట కాలనీలో అభివృద్ధి పనులకు కొందరి మొండివైఖరి శాపంగా మారింది. వార్డు సభ్యురాలి నిధుల నుండి మంజూరైన రూ. 5 లక్షల సైడ్ కాలువ నిర్మాణాన్ని, తమ ఇంటి మెట్లు దెబ్బతింటాయన్న నెపంతో కొందరు అడ్డుకోవడంపై సిపిఐ (ఎం) పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పంచాయతీ అధికారులకు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ముంచుకొస్తున్న వేళ, అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ వల్ల వరద నీరు రోడ్లపై నిలిచి దోమలు, పందులకు నిలయంగా మారుతోందని, ఇది అంటువ్యాధులకు రాజమార్గం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్ల విస్తరణ కోసం పెద్ద పెద్ద భవనాలనే కూల్చివేసే యంత్రాంగం, కాలనీ ప్రయోజనాల దృష్ట్యా చిన్న మెట్లను తొలగించి పనులు పూర్తి చేయలేదా అని ఆయన ప్రశ్నించారు. పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి తక్షణమే జోక్యం చేసుకుని ఈ 'మెట్ల' పేచీని పరిష్కరించి, కాలనీవాసులను గండం నుండి గట్టెక్కించాలని డిమాండ్ చేశారు.

## మున్సిపల్ సమావేశాలో పాల్గొన్న ఛాంబర్ చైర్మన్ కంచర్ల భాస్కరావు

భద్రాద్రి కొత్తగూడెం అశ్వరావుపేట, మే 05 జన సంఘర్షణ



ఈరోజు మున్సిపల్ కార్యాలయం కమిషనర్ దిలీప్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి షాప్ వారు పరిశుభ్రత పాటించాలని, షాపులోని వ్యర్థలు డస్ట్ బిన్ పెట్టుకొని కవర్లు, లేదా సంచుల్లో మూటకట్టి సాయంత్రం షాప్ మూసేప్పుడు బయట పెట్టి వెళ్లాలని చూచించరు. రేపటి నుండి ఏ షాప్ ముందు చేత్త, చెదారం కనిపించిన ఫైన్ వేస్తామని తెలియచేసారు. వేరే వాళ్ళు ఎవరైనా మన షాప్ ముందు చెత్త వేసిన, ఇబ్బంది కలిగించేలాగా వున్నా కమిషనర్‌కి తెలియ చేయగలరని తెలిపారు. లోకల్ ఆటోలకు పన్ను రాయితీ ఇవ్వాలని ఛాంబర్ అధ్యక్షులు మున్సిపల్ చెర్మన్‌ని కోరడంతో సానుకూలంగా స్పందించి ఈరోజు నుండి లోకల్ ఆటోలో సరుకు తెచ్చిన, తీసుకెళ్లిన మున్సిపల్ పన్ను ఉండదని వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఛాంబర్ తరుపున ఇరవై మంది వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## సాగులో మార్పు.. రైతుకు గెలుపు

- ఆయిల్ పామ్ సాగుపై ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పిలుపు

దుమ్ముగూడెం మే 05 (జన సంఘర్షణ)



సంప్రదాయ సాగు విధానాల నుంచి రైతాంగం లాభసాటి వాణిజ్య పంటల వైపు అడుగులు వేసినప్పుడే ఆర్థిక పరిపుష్టి సాధ్యమవుతుందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆకాంక్షించారు. 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా చిన్నబండిరేవు గ్రామంలో నిర్వహించిన రైతు వారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగు ఆవశ్యకతను వివరిస్తూ, మన ప్రాంత భూములు ఉద్యాన పంటలకు ఎంతో అనువైనవని, మార్కెట్ డిమాండ్‌ను బట్టి రైతులు తమ సాగు ప్రణాళికలను మార్చుకోవాలని సూచించారు. "కేవలం కష్టపడటమే కాదు, అధికారుల సమన్వయంతో ఆధునిక సాంకేతికతను జోడించి సాగు చేస్తేనే రైతు దినదినాభివృద్ధి చెందుతాడు" అని ఆయన పేర్కొన్నారు. కేవలం పంట పండించడమే కాకుండా, ప్రత్యామ్నాయ పంటల ద్వారా స్థిరమైన ఆదాయాన్ని పొందే దిశగా ప్రతి రైతు ఆలోచించాలని ఆయన చేసిన ప్రసంగం సభికులను ఆలోచింపజేసింది.

## జ్యూయలరీ షాపుల సీసీ కెమెరాలు పెట్టాలి




బోధన్: మే 05 జన సంఘర్షణ

బోధన్ పట్టణంలోని పట్టణ ఎస్ హెచ్ ఓ ఆధ్వర్యంలో జ్యువలరీ షాప్ యజమానులతో మంగళవారం సాయంత్రం మీటింగ్ నిర్వహించారు. జ్యూయలరీ యజమానులు సెక్యూరిటీ గురించి మీటింగ్ పెట్టడం జరిగింది. ఈ సమావేశంలో ఏసీపీ బోధన్, సీసీఎస్ ఏసీపీ మస్తాన్ ఆలీ, ఎస్ఐ భాస్కరాచారి హాజరైనారు. ఖచ్చితంగా సీసీ కెమెరాలు మానిటరింగ్ చేసుకోవాలని ఆయన తెలిపారు. తప్పనిసరిగా జ్యువెలర్స్ షాప్ లో సెక్యూరిటీ గార్డ్ నియమించుకోవాలని, 24 గంటల అప్రమత్తంగా ఉండాలి. అలారం వ్యవస్థ పెట్టుకోవాలి. ఈ కార్యక్రమంలో జ్యువెలరీ షాప్ యజమానులు, బోధన్ ఏసిపి శ్రీనివాస్, సిసిఎస్ మస్తాన్ వల్లి, బోధన్ ఎస్హెచ్ఓ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిలో బీజేపీ నాయకులు సంబరాలు



ఎల్లారెడ్డి, మే -5(జన సంఘర్షణ )
మూడు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ పార్టీ భారీ విజయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా ఎల్లారెడ్డి కేంద్రంలో మంగళవారం బీజేపీ నాయకులు గెలుపు సంబురాలు నిర్వహించారు. పటాకులు కాల్చి, స్వీట్లు పంచి తమ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ... దేశంలోని పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బీజేపీ గెలుపు ద్వారా హిందువులు తమ సత్తాని చాటరాని అన్నారు. హైందవ ధర్మానికి వ్యతిరేకంగా వ్యవహరించిన పార్టీలను మట్టికరిపించారాని అన్నారు. ఇక పశ్చిమ బెంగాల్లో బీజేపీ గెలుపుకు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా చరిష్మాకు దక్కిన విజయమని అన్నారు. బెంగాల్లో బీజేపీ కార్యకర్తలు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని పార్టీని అధికారంలోకి తీసుకురావడం ద్వారా శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆత్మకు శాంతి చేకూరిందన్నారు. ఈ విజయం భావోద్వేగాలకు ప్రతిధ్వని హర్షం వ్యక్తం చేశారు.

**తెలంగాణ రాష్ట్రంలో వచ్చేది బిజెపి ప్రభుత్వమే...**

మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో రాబోయే రోజుల్లో తెలంగాణాలో కూడా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ దిశగా బీజేపీ నాయకత్వం కృషి చేస్తుందని వారు ఆశభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు రాజేష్, రాష్ట్ర నాయకులు మర్రి బాలకిషన్, జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్, నాయకులు సతీష్, శంకర్, శ్రీను, అశోక్, కాశినాథ్, శివ, బాలరాజ్ సత్యం, గజానంద్, పండరి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన 11వ వార్డు కౌన్సిలర్




ఎల్లారెడ్డి, మే -5(జన సంఘర్షణ )
ఎల్లారెడ్డి మున్సిపల్ 11వ వార్డు (లింగారెడ్డిపేట్) బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ రామగాళ్ల లక్ష్మి శివానంద్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 10 సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 11వ వార్డులో ఎలాంటి అభివృద్ధి జరగలేదని తెలిపారు. అయితే ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వంలో గత 2 సంవత్సరాలలో గణనీయమైన అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని పేర్కొన్నారు.శ్మశానవాటికకు బోర్ వేయడం, సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయడం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, విద్యుత్ సమస్యలను పరిష్కరించడం, హరిజనవాడలో కొత్త స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయడం వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రభావితమై కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, డీసీసీ వైస్ ప్రెసిడెంట్, ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుర్మ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# హార్టికల్చరుకు అండగా నిలవండి

◆ **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**





కుప్పం,మే 05 (జన సంఘర్షణ):
హార్టికల్చర్ను ప్రోత్సహించాలనే ప్రభుత్వ ఆలోచనలకు మద్దతుగా ఉండాలని బ్యాంకులు, నాబార్డ్ ప్రతినిధులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. ఏడాదికి 450 లక్షల మెట్రికల్ టన్నుల హార్టికల్చర్ ఉత్పత్తులు రాష్ట్రం సాధించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం తెలిపారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో వ్యవసాయం అందులోనూ హార్టికల్చర్, ఆక్వాకల్చర్ కీలక పాత్ర పోషిస్తున్నాయని సీఎం అన్నారు. దీనికి అవసరమైన పూర్తి సహకారాన్ని బ్యాంకులు, నాబార్డ్ అందించాలని సీఎం కోరారు.నాబార్డు క్రెడిట్ ప్లాన్ స్టేట్ ఫోకస్ పేపర్ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. 2026-27 సంవత్సరానికి గాను రూ.5.11 లక్షల కోట్ల రుణ ప్రణాళికతో నాబార్డు అంచనాలు రూపొందించింది. రుణ ప్రణాళిక గత ఏడాది రూ.4.24 లక్షల కోట్లు ఉండగా ఈ ఏడాది 20 శాతం పెంచి రూ.5,11,491 కోట్లతో ప్రాథమిక రంగానికి రుణ ప్రణాళిక ప్రకటించింది. సాగుకు మొత్తం రూ.2.55 లక్షల కోట్లు కేటాయించింది. ఇందులో పంట రుణాలు రూ.1.66 లక్షల కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ.34,972 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.8,265 కోట్లు, ఫిషరీస్కు రూ.21,098 కోట్లు, హార్టికల్చర్కు రూ.11,961 కోట్లు కేటాయించింది.

# ప్రజాస్వామ్య పునరుద్ధరణే లక్ష్యంగా టీజేఎస్ సమరభేరి


◆ **12న హైదరాబాద్‌లో నాలుగో ప్లీనరీ!**



భద్రాచలం మే 05 (జన సంఘర్షణ)
తెలంగాణ అస్తిత్వ పోరాటంలో మేధోపరమైన గొంతుకగా నిలిచిన తెలంగాణ జన సమితి (టీజేఎస్), రాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక ఘట్టానికి తెరలేపింది. ఈ నెల 12న హైదరాబాద్‌లోని జలవిహార్ గద్దర్ ప్రాంగణంలో నిర్వహించనున్న పార్టీ నాలుగో ప్లీనరీ సమావేశం కేవలం ఒక రాజకీయ కార్యక్రమంగా కాకుండా, ఉద్యమ ఆశయాల పునశ్చరణ వేదికగా మారబోతోంది. మంగళవారం భద్రాచలంలో జరిగిన సన్నాహక సమావేశంలో తొలిదశ ఉద్యమ నేత తిప్పన సిద్ధులు, జిల్లా అధ్యక్షుడు బరగడ దేవదానం ఈ మహాసభకు పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో సాగుతున్న ఈ ప్రయాణం, నీళ్లు-నిధులు-నియామకాలనే ప్రాథమిక సూత్రాల నుంచి ప్రజాస్వామ్య పరిరక్షణ వైపు ఎలా మలుపు తిరుగుతోందో ఈ ప్లీనరీ దిశానిర్దేశం చేయనుంది. గత దశాబ్ద కాలపు రాజకీయాలను విశ్లేషిస్తే, తెలంగాణ రాష్ట్రం సిద్ధించినా సామాన్యుడి ఆకాంక్షలు నెరవేరలేదన్న అసంతృప్తి ఉద్యమకారుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వం అనుసరించిన నిరంకుశ పోకడలు, కాంట్రాక్టులు, కమీషన్లకే ప్రాధాన్యతనిచ్చే రాజకీయ సంస్కృతి వల్ల సామాజిక న్యాయం వెనుకబడిందని నేతలు గళమెత్తారు. "నిధుల మళ్లింపు జరిగింది, కానీ నియామకాల కలను నీరుగార్చారు" అంటూ తిప్పన సిద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం అధికార మార్పిడి కోసమే కాకుండా, వ్యవస్థాగత మార్పు కోసం కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించామన్న వారి మాటలు, రాష్ట్ర భవిష్యత్తుపై వారికున్న బాధ్యతను గుర్తు చేస్తున్నాయి. మరోవైపు, దేశవ్యాప్తంగా ప్రబలుతున్న విభజన రాజకీయాలు, కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై టీజేఎస్ హెచ్చరికలు జారీ చేస్తోంది. అంబేద్కర్ బోధించిన "చదువు-బోధించు-పోరాడు" అనే సిద్ధాంతాన్ని, ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తిని ఆయుధాలుగా చేసుకుని ప్రజలను మళ్లీ చైతన్యపరచాల్సిన సమయం ఆసన్నమైందని ఈ సమావేశం నొక్కి చెప్పింది. తెలంగాణ పునర్నిర్మాణం అంటే కేవలం భవనాల నిర్మాణం కాదు, సామాన్యుడి ఆత్మగౌరవం నిలబెట్టడమేనని ప్రతిబింబించేలా ఈ ప్లీనరీ సాగనుంది. ఈ చారిత్రాత్మక సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి తెలంగాణ రెండో దశ సామాజిక పోరాటంలో భాగస్వాములు కావాలని నాయకత్వం పిలుపునిచ్చింది.

# బూర్గంపాడులో కారు బీభత్సం

◆ **రోడ్డు దాటుతున్న మహిళకు తీవ్ర గాయాలు!**




బూర్గంపాడు మే 05 (జన సంఘర్షణ)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు సమీపంలో మంగళవారం సాయంత్రం అతివేగంగా వచ్చిన కారు రోడ్డు దాటుతున్న ఓ మహిళను బలంగా ఢీకొట్టింది. సంజీవరెడ్డి గ్రామానికి చెందిన బాధితురాలు రహదారి దాటుతుండగా ఈ ప్రమాదం సంభవించగా, కారు ధాటికి ఆమె గాల్లోకి ఎగిరి కింద పడటంతో తీవ్ర రక్తగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను సమీప ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్దకు చేరుకుని, "మా అమ్మ ప్రాణాలను ఎలాగైనా కాపాడండి" అంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు అక్కడున్న వారిని కలచివేసింది. ప్రమాదానికి కారణమైన కారు వివరాలను స్థానికులు పోలీసులకు అందజేయగా, మితిమీరిన వేగమే ఈ ఘటనకు కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# డిగ్రీ పరీక్షలు ప్రశాంతం




బోధన్: మే 05 జన సంఘర్షణ
తెలంగాణ వర్సిటీ పరిధిలో డిగ్రీ రెగ్యులర్/ బ్యాక్ లాగ్ పరీక్షలు ఈ రోజు ప్రశాంతంగా జరిగాయని అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంట. చంద్ర శేఖర్ తెలిపారు.
ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో మొత్తం 29 పరీక్ష కేంద్రాలలో 2286 మంది విద్యార్థులకు గాను 2154 మంది విద్యార్థులు హాజరు కాగా 132 మంది గైర్హాజర్ అయ్యారు. ఉదయం జరిగిన ఆరవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షకు 2143 మంది విద్యార్థులకుగాను 2031 మంది హాజరు కాగా 112 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన మొదటి సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్షకు 143 మంది విద్యార్థులకు గాను 123 మంది హాజరు కాగా 20 మంది గైర్ హాజరయ్యారని ఆయన తెలిపారు.

# రేవంత్ సర్కార్‌కు హైకోర్టు షాక్

◆ **సహకార సంఘాల్లో పాత పాలకవర్గాల పునరుద్ధరణపై సుజాతనగర్ బిఆర్ఎస్ హర్షం!**



కొత్తగూడెం మే 05 (జన సంఘర్షణ)
సహకార సంఘాల ఎన్నికలను రద్దు చేసి, నామినేటెడ్ పద్ధతిలో తమ అనుయాయులకు పదవులు కట్టబెట్టాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ వ్యూహానికి హైకోర్టు తీర్పుతో గట్టి ఎదురుదెబ్బ తగిలిందని బిఆర్ఎస్ సుజాతనగర్ మండల కమిటీ అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ పేర్కొన్నారు. ఓటమి భయంతోనే రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరించిందని విమర్శించిన ఆయన, కోర్టు తీర్పుతో పాత పాలకవర్గాలే కొనసాగనుండటం శుభపరిణామన్నారు. ఈ న్యాయ పోరాటంలో అండగా నిలిచిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు, లీగల్ టీమ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, తిరిగి బాధ్యతలు చేపడుతున్న పాలకవర్గాలకు సత్యనారాయణ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో సహకార రంగం వేదికగా సాగుతున్న రాజకీయ రణక్షేత్రంలో బిఆర్ఎస్ పార్టీ నైతిక విజయం సాధించింది. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా, అడ్డదారిలో నామినేటెడ్ కమిటీలను వేయాలని చూసిన కాంగ్రెస్ ప్రభుత్వ ప్రయత్నాలను హైకోర్టు అడ్డుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ పరిణామంపై బిఆర్ఎస్ సుజాతనగర్ మండల కమిటీ అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ స్పందిస్తూ, ఇది కేవలం ఒక కోర్టు తీర్పు మాత్రమే కాదని, రేవంత్ రెడ్డి సర్కార్ అప్రజాస్వామ్య ధోరణికి పడిన 'చెంపదెబ్బ' అని అభివర్ణించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్మలైన సహకార సంఘాలపై పట్టు సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలకు తెరలేపిందని సత్యనారాయణ ధ్వజమెత్తారు. క్షేత్రస్థాయిలో బిఆర్ఎస్ బలాన్ని చూసి వణికిపోతున్న ప్రభుత్వం, ఎన్నికలకు వెళ్తే ఓటమి తప్పదని భావించి నామినేటెడ్ పోస్టుల పేరుతో అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూసిందని విమర్శించారు. అయితే న్యాయస్థానం పాత పాలకవర్గాలనే కొనసాగించాలని స్పష్టమైన తీర్పు ఇవ్వడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను కాపాడిందని ఆయన కొనియాడారు. ఈ చారిత్రాత్మక విజయంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శకత్వం, పార్టీ లీగల్ టీమ్ చేసిన అసమాన కృషిని లావుడ్యా సత్యనారాయణ ప్రత్యేకంగా ప్రస్తావించారు. బాధితులకు అండగా నిలబడి, న్యాయస్థానాల్లో గట్టిగా వాదనలు వినిపించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ తీర్పుతో ప్రభుత్వానికి ప్రజల పక్షాన, చట్టం పక్షాన గట్టి హెచ్చరిక జారీ అయిందని, ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకుంటే న్యాయం ఊరుకోదని ఆయన స్పష్టం చేశారు. గత కొంతకాలంగా పాలనకు దూరంగా ఉన్న సహకార సంఘాలలో మళ్లీ పాత పాలకవర్గాల పాలన ప్రారంభం కావడం పట్ల సుజాతనగర్ మండల పరిధిలోని రైతాంగం, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తిరిగి బాధ్యతలు చేపడుతున్న ప్రతి ఒక్క పాలకవర్గ సభ్యునికి సత్యనారాయణ తన మండల కమిటీ పక్షాన శుభాకాంక్షలు తెలియజేశారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని, పార్టీ శ్రేణులు ఈ విజయాన్ని ఉత్సాహంతో క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. చివరగా, అధికార మదంతో వ్యవస్థలను మేనేజ్ చేయాలని చూస్తున్న కాంగ్రెస్ నాయకులు ఇకనైనా కళ్లు తెరవాలని సత్యనారాయణ హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులను కాదని, నామినేటెడ్ నాటకాలతో కాలం గడపడం సాధ్యం కాదని ఈ తీర్పు నిరూపించిందన్నారు. రాబోయే రోజుల్లో కూడా బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన ఉండి, ప్రభుత్వ అప్రజాస్వామ్య విధానాలపై రాజీలేని పోరాటం చేస్తుందని లావుడ్యా సత్యనారాయణ ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

# టెన్త్ క్లాస్ మండల్ టాపర్‌కు సైకిల్ బహుకరణ...

◆ **బాన్సువాడ నియోజకవర్గం ఇంచార్జ్ బిజెపి ఎన్నారై శశాంక్**



కోటగిరి/మే 5/ (జన సంఘర్షణ)
కోటగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలో ఉతిర్నత సాధించిన ఏడ్డడి అబిలాష్ ప్రభుత్వ పాఠశాల మండల టాపరుగా ర్యాంక్ సాధించిన విద్యార్థికి కోనేరు ట్రస్టుబుల్ అధినేత ఎన్నారై కోనేరు శశాంక్ చేతుల మీదుగా సైకిల్‌ను బహుకరించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి ర్యాంక్ సంపాదించే ప్రతి విద్యార్థికి మేము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని వారికి తగిన సహాయం చేస్తామని వారు తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థులకు పరీక్ష ఫీజులు చెల్లించడం జరిగిందన్నారు. మండల్ టాపర్గా ర్యాంక్ సాధించిన విద్యార్థికి సైకిల్ అందజేయడం జరుగుతుందని తెలియజే జేశారు.ప్రభుత్వ పాఠశాలలో చదివి 508 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాల మండల్ టాపర్గా గెలుపొందిన అభిలాష్‌కు విద్యార్థికి నేడు సైకిల్ అందజేయడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థి తల్లిదండ్రులకు శాలువాతో సత్కరించి కష్టపడి చదివే పిల్లలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎప్పటికీ ఉండాలని వారు వారిని కోరారు. అలాగే కష్టపడి చదివి ర్యాంకు సంపాదించే ప్రతి విద్యార్థులకు మేము ఎల్లవేళలా తోడు ఉంటామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేముల నవీన్, రుద్రర్ మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ, ప్రకాష్ పటేల్, పబ్బ శేఖర్, శ్రీనివాస్ మామిడి సాయిలు తదితరులు పాలుగోన్నారు.

# ఇల్లందు గడ్డపై ధర్మ కిరీటం.. కాషాయ జెండా రెపరెప!






**◆ ధర్మ రక్షణే శ్వాసగా.. ఇల్లందు గడ్డపై ఆవిష్కృతమైన హిందూ మహాశక్తి!**

**◆ సింగరేణి సాక్షిగా.. ధర్మ సునామీ!**

ఇల్లందు మే 05 (జన సంఘర్షణ)

ఇల్లందు పట్టణంలోని జేకే కాలనీ సింగరేణి మైదానంలో నిర్వహించిన 'హిందూ సమ్మేళనం' ఆధ్యాత్మిక వైభవానికి అద్దం పట్టింది. అఖిల భారత నామ్ దారీ అఖాడా మండలేశ్వర్ శ్రీ శివనాగస్వామి, విజ్ఞానంద భారతి, మరియు వీరభద్రం గురూజీల సమక్షంలో జరిగిన ఈ సభలో వేలాదిగా తరలివచ్చిన భక్తులు హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతిజ్ఞ పూనారు. పులిగల్ల మాధవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు ప్రసంగిస్తూ.. హిందూ ఐక్యతే దేశానికి శ్రీరామరక్ష అని, ప్రతి ఇంట్లో సంస్కృతి పరిమళించాలని పిలుపునిచ్చారు.




పట్టణమంతా కాషాయ జెండాలతో రెపరెపలాడగా, జేకే కాలనీ గ్రౌండ్ హిందూ జనసముద్రాన్ని తలపించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చారిత్రాత్మక గని నగరం ఇల్లందు, మంగళవారం నాడు అపూర్వమైన ఆధ్యాత్మిక చైతన్యానికి వేదికైంది. కులమతాలకు అతీతంగా, ప్రాంతీయ భేదాలను పక్కనపెట్టి 'హిందువులంతా ఒక్కటే' అన్న నినాదం ఇల్లందు వీధుల్లో మారుమోగింది. పట్టణంలోని ప్రతి కూడలి, ప్రతి గల్లీ కాషాయ జెండాలతో అలంకరించబడి, కళ్ళకు కాషాయ వర్ణపు కాంతిని అద్దుతూ ఒక పవిత్ర క్షేత్రాన్ని తలపించింది.

**చిన్నారుల నృత్యాలు - ఆధ్యాత్మిక పరవశం:**

ఈ సమ్మేళనంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది చిన్న పిల్లల సాంస్కృతిక ప్రదర్శనలు. చిన్నారులు వేసిన పౌరాణిక వేషధారణలు, వారి పాదముద్రల లయబద్ధమైన నృత్యాలు సభికులను మంత్రముగ్ధులను చేశాయి. రామాయణ, భారత గాథలను ప్రతిబింబించేలా పిల్లలు ప్రదర్శించిన నృత్య రూపకాలు హిందూ ధర్మ వారసత్వం తదుపరి తరాలకు ఎంత పటిష్టంగా అందుతుందో చాటిచెప్పాయి. ఆ బుజ్జి పాదాల సందడి, ఆ చిన్ని చేతుల ముద్రలు చూస్తుంటే సాక్షాత్తూ దైవమే భువికి దిగివచ్చిందా అన్నట్లుగా ఆధ్యాత్మిక నిశ్శబ్దాన్ని నింపాయి. ఈ ప్రదర్శనలు సభలో ఒక ప్రత్యేక ఉత్తేజాన్ని, ఉద్వేగాన్ని రగిల్చాయి. జేకే కాలనీలోని సింగరేణి గ్రౌండ్ వేదికగా జరిగిన ఈ 'హిందూ సమ్మేళనం' అక్షరాలా ఒక జనసముద్రాన్ని తలపించింది. అంచనాలకు మించి తరలివచ్చిన అశేష భక్తజన వాహినిని చూస్తుంటే, హిందూ ధర్మం పట్ల ప్రజల్లో ఉన్న అచంచలమైన విశ్వాసం, తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాలన్న తపన స్పష్టంగా కనిపించింది. ఈ సమ్మేళనం కేవలం ఒక సభ మాత్రమే కాదు, అది హిందూ సమాజం యొక్క ఆత్మగౌరవ ప్రకటనగా నిలిచింది. సభలో ప్రసంగించిన అఖిల భారత నామ్ దారీ అఖాడా మండలేశ్వర్ శివనాగస్వామి ప్రసంగం సభికుల్లో ఉత్తేజాన్ని నింపింది. ప్రపంచానికి దిశానిర్దేశం చేసిన సనాతన ధర్మం నేడు ఎదుర్కొంటున్న సవాళ్లను ఆయన విశ్లేషించారు. హిందూ ధర్మం అంటే కేవలం పూజలు, పునస్కారాలు మాత్రమే కాదని, అది లోక కల్యాణాన్ని కాంక్షించే ఒక మహోన్నత జీవన విధానమని ఆయన ఉద్ఘాటించారు. మన మూలాలను గౌరవించని జాతికి భవిష్యత్తు ఉండదని ఆయన హెచ్చరించారు. మరో వక్త విజ్ఞానంద భారతి మాట్లాడుతూ.. హిందూ సమాజంలో ఐక్యత లేకపోవడమే అనేక సమస్యలకు కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. హిందువులందరూ ఏకతాటిపైకి వచ్చినప్పుడే ఈ దేశానికి, సమాజానికి నిజమైన రక్షణ లభిస్తుందని, ఆ ఐక్యతే 'శ్రీరామరక్ష' అని పేర్కొన్నారు. విభజన రాజకీయాలకు తావులేకుండా, ధర్మం కోసం అందరూ సైనికుల్లా కదలాలని ఆయన పిలుపునిచ్చారు. వీరభద్రం గురూజీ తన ప్రసంగంలో మాతృశక్తి యొక్క ప్రాధాన్యతను గుర్తుచేశారు. ప్రతి తల్లి తన బిడ్డలకు చిన్నతనం నుంచే రామాయణ, భారత గాథలను, మన సంస్కృతిలోని గొప్పతనాన్ని బోధించాలని కోరారు. ఇల్లు ఒక ధర్మ పీఠం కావాలని, అప్పుడే రేపటి తరం దేశభక్తి గల పౌరులుగా ఎదుగుతారని ఆయన సూచించారు. సంస్కృతి కాపాడబడితేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ఆయన నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉత్సవ సమితి అధ్యక్షులు పులిగల్ల మాధవరావు నాయకత్వంలో ఏర్పాట్లు అత్యంత వైభవంగా జరిగాయి. హిందూ ధర్మ గొప్పతనాన్ని చాటిచెప్పేలా సాంస్కృతిక ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు సాగాయి. ఇల్లందు చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున హిందువులు స్వచ్ఛందంగా ఏకమవ్వడం ఇదే ప్రథమమని రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయ పడుతున్నారు. హిందూ ధర్మం యొక్క గొప్పతనం దాని సహనంలోనే ఉందని, అయితే ఆ సహనాన్ని అసమర్థతగా భావించవద్దని ఈ సమ్మేళనం ప్రపంచానికి చాటిచెప్పింది. శాంతిని కాంక్షిస్తూనే, ధర్మ రక్షణ కోసం అవసరమైతే పోరాడేందుకు సిద్ధమన్న సందేశం ఈ వేదిక ద్వారా స్పష్టమైంది. ఇల్లందు గడ్డపై ఎగిరిన కాషాయ జెండా.. హిందూ చైతన్యానికి నిదర్శనంగా నిలిచింది. జేకే కాలనీ మైదానం నుంచి వేలాది గొంతుకలు ఒకేసారి పలికిన జై శ్రీరామ్ నినాదాలు ఇల్లందు కోటను తాకాయి. ఈ సమ్మేళనం కేవలం ఇక్కడితో ముగిసేది కాదని, ప్రతి గ్రామంలోనూ, ప్రతి ఇంట్లోనూ హిందూ ధర్మ జ్యోతిని వెలిగించేందుకు ఈ సభ ఒక ఆరంభం మాత్రమేనని నిర్వాహకులు ప్రకటించారు. మొత్తానికి ఇల్లందు హిందూ సమ్మేళనం ఒక చారిత్రాత్మక విజయంగా ఆధ్యాత్మిక చరిత్రలో నిలిచిపోతుంది.

# భద్రాచలం చెక్‌పోస్ట్‌పై 'నల్ల మత్తు' ఘాటు

**◆ కోటిన్నర విలువైన హాసిష్ ఆయిల్ పట్టివేత!**

భద్రాచలం మే 05 (జన సంఘర్షణ)

ఆధ్యాత్మిక క్షేత్రం భద్రాచలం వేదికగా సాగుతున్న మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పోలీసులు మరోసారి బ్రేక్ వేశారు. పట్టణంలోని కూనవరం రోడ్డులో గల వీరభద్ర ఫంక్షన్ హాల్ సమీపంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో, దాదాపు 12.50 లక్షల రూపాయల విలువైన ఒక కేజీ గంజాయి లిక్విడ్ (హాసిష్ ఆయిల్)ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో ఒక కారుతో పాటు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.




**ఒడిస్సా మూలాలు.. నాగర్ కర్నూల్ లక్ష్యం:**

ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న నెట్‌వర్క్ ఒడిస్సాలోని కలిమెల నుంచి తెలంగాణలోని నాగర్ కర్నూల్ వరకు విస్తరించి ఉంది. నిందితులైన నిరిడి సాయిరాం (24), కందాల కేశవులు (20) ఇద్దరూ నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు మండలం చెర్ల ఇటిక్యాల గ్రామానికి చెందినవారు. కేవలం డ్రైవర్లుగా పనిచేసే ఈ యువకులు, తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో ఈ ప్రమాదకరమైన మత్తు వ్యాపారంలో పావులుగా మారడం గమనార్హం.

**మత్తు కోరల్లో యువత - ఆలోచించాల్సిన సమయం**

ఈ ఉదంతం కేవలం ఒక క్రైమ్ రిపోర్ట్ మాత్రమే కాదు, నేటి యువత ఏ దారిలో వెళ్తున్నారనేదానికి ఒక నిదర్శనం. 20 ఏళ్ల వయసులో సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన యువకులు, మత్తు పదార్థాలను తరలిస్తూ జైలు పాలవ్వడం విషాదకరం. వేల రూపాయల కూలీ కోసం లక్షల విలువైన విషాన్ని సమాజంలోకి పంపుతున్న ఈ 'వ్యాపారులు'.. ఎంతమంది జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నారో ఆలోచించాల్సిన అవసరం ఉంది. గంజాయి కంటే ప్రమాదకరమైన ఈ లిక్విడ్ ఫామ్, యువతను పెడదారి పట్టించే క్యాన్సర్ లాంటిది.

**పోలీసుల నిఘా.. మూలాలపై దెబ్బ**

భద్రాచలం పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సరిహద్దుల గుండా జరుగుతున్న ఈ సరఫరాను అడ్డుకుంటున్నప్పటికీ, మూలాల వరకు వెళ్లడం ఇప్పుడు సవాలుగా మారింది. కూలీలను పట్టుకోవడం ఒకెత్తు అయితే, వీరి వెనుక ఉండి నడిపిస్తున్న అసలు సూత్రధారులను పట్టుకున్నప్పుడే ఈ మత్తు మహమ్మారిని అంతం చేయగలం. ప్రభుత్వం మరియు తల్లిదండ్రులు కూడా యువత కదలికలపై నిఘా ఉంచకపోతే, రేపటి తరం మత్తులో చిత్తు కావడం ఖాయం.

## పోతంగల్ గ్రామ నివాసి గంధపు దత్తు అనే వ్యక్తిపై దాడి చేసినందుకు 11 మంది వ్యక్తులపై కేసు నమోదు



పోతంగల్/మే 5/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని పోతంగల్ గ్రామ నివాసి గంధపు దత్తు అనే వ్యక్తిపై దాడి చేసినందుకు 11 మంది వ్యక్తులపై కేసు నమోదు. ఈ సంఘటన 04 ఏప్రిల్ రాత్రి 11:00 గం ముఖ్య నిందితులు ముత్యాల సాయి విశాల్ (హంగర్గా గ్రామం),ఇతడిని ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మిగిలిన నిందితులు పరారీలో ఉన్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ప్రవీణ్ గౌడ్, షేక్ ముజీబ్, పంజా మహేందర్, పంజా గోవింద్, గంధపు రాజు, గంధపు గంగారాం, రజాక్, లింగ గౌడ్, సుభాష్ , ముత్యాల భాగయ్య పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది అని ఎస్సై సునీల్ తెలిపారు.

## పశ్చిమ బెంగాల్లో బిజెపికి అమోఘమైన విజయాన్ని అందించిన బెంగాల్ ప్రజలకు కృతజ్ఞతలు

**◆ బిజెపి ఇన్నరై శశాంక్**

కోటగిరి/మే5/(జన సంఘర్షణ)



బాన్సువాడ నియోజకవర్గ నాయకులు కోనేరు శశాంక్ ధన్యవాదాలు తెలిపారు. నరేంద్ర మోడీ, అమిత్షాలపై నమ్మకంతో ప్రజలు మరో మూడు రాష్ట్రాల్లో బిజెపికి అధికారం అందించారని అన్నారు. బిజెపి నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ రాష్ట్రం అని అందుకోసమే ఈనెల 10వ తారీఖున హైదరాబాదులో ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఈ కార్యక్రమానికి బిజెపి శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోనేరు శశాంక్ కోరారు. పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో బిజెపి పార్టీ సాధించిన అఖండ విజయానికి వర్షం వ్యక్తం చేస్తూ కోటగిరి మండల కేంద్రంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు ఏముల నవీన్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ బిజెపి నాయకులు కోనేరు విశ్వశాంతి ముఖ్య అతిగా పాల్గొన్నారు. కోనేరు శశాంక్ ఆధ్వర్యంలో కార్యకర్తలకు, ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. బాణ సంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి బాన్సువాడ నియోజకవర్గ నాయకులు కోనేరు శశాంక్ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో దిది దరిద్రమైన పాలన కు బై బై చెప్పి ప్రజలు స్వస్తి పలికారని కేంద్రంలో అద్భుతమైన పరిపాలన చేస్తున్న నరేంద్ర మోడీ, అమిత్ షాలపై నమ్మకంతో బిజెపికి అమోఘమైన విజయాన్ని అందించారని అన్నారు. బిజెపి నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ రాష్ట్రమే అని అందుకోసమే ఈనెల 10వ తారీఖున హైదరాబాదులో భారీ సభ ఏర్పాటు చేయనున్నట్లు ఈ సభకు ప్రధాని నరేంద్ర మోడీ రానున్నట్లు తెలిపారు. బిజెపి కార్యకర్తలు ఈ సభలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు ఏముల నవీన్ మాట్లాడుతూ... పశ్చిమ బెంగాల్లో మమతా బెనర్జీ అరాచక పాలనకు ప్రజలు బుద్ధి చెప్పారని అక్కడి ప్రజలపై బిజెపి కార్యకర్తలపై జరుగుతున్న దాడులను చూసి ప్రజలు మమత బెనర్జీకి ఓటుతో బుద్ధి చెప్పారని అన్నారు. భారతీయ జనతా పార్టీ సిద్ధాంతకర్త పార్టీ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సొంత రాష్ట్రంలో బిజెపి జెండా ఎగరటం దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని అన్నారు. అస్సాం లో హిమంత బిశ్వ శర్మ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీ మూడవసారి విజయ దుందుభి మోగించిందని హర్షం వ్యక్తం చేశారు. అస్సాం,పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ లో బిజెపికి విజయం అందించిన ప్రతి ఒక్క కార్యకర్తకు ఓటర్లకు కోటగిరి మండలం బిజెపి పార్టీ తరపున ధన్యవాదాలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో సైతం బిజెపి పార్టీ జెండాను ఎగరవేసేందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉన్నామని నరేంద్ర మోడీ అమిత్ షా లు తెలంగాణ రాష్ట్రంపై ప్రత్యేక దృష్టి సారించి భారతీయ జనతా పార్టీ జెండాను ఎగరవేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపిని బలపరిచేందుకు ఈనెల 10వ తారీఖున హైదరాబాదులో నిర్వహించే సభకు నరేంద్ర మోడీ వస్తున్నారని కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు కోనేరు శశాంక్,మండల అధ్యక్షులు ఏముల నవీన్ సీనియర్ నాయకులు మోహన్ రావు హాగీర్ రావు దేశాయ్ జనరల్ సెక్రటరీ సాయి కుమార్ గౌడ్,వడ్ల శ్యామ్ మండల ఉపాధ్యకులు బోనిగే శ్యామ్ ,బూత్ అధ్యక్షులు కోయిగుర్ సాయిలు, మామిడి శ్రీనివాస్, నాగరాజు, మామిడి సాయిలు బీజేవైఎం మండల అధ్యక్షులు గుంజరి జగదీష్, రుద్రూర్ మండల అధ్యక్షులు ఆలపాటి హరి కృష్ణ సోషల్ మీడియా ఇంచార్జి దుబాస్ మహేష్ కార్యకర్తలు కర్నె రాజు నరేష్, ప్రశాంత్, సంఘని వినోద్, మదరి శివ, రుద్ర గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ సాధన కోసం పోరాడుతాం: కాకాణి

నెల్లూరు జిల్లా- (జన సంఘర్షణ):

దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించిన వైఎస్ఆర్ సీపీ నాయకులు, రైతు సంఘాల నాయకులు. కాకాణి ఆధ్వర్యంలో నిర్వహించిన "రాయలసీమ ఎత్తిపోతల పథకం భవిష్యత్తు కార్యచరణ" రౌండ్ టేబుల్ సమావేశంలో పెద్ద ఎత్తున పాల్గొన్న రైతులు,రైతు సంఘాల నాయకులు. కాకాణి ప్రసంగంతో ఈలలు, చప్పట్లతో మారుమ్రోగిన సభా ప్రాంగణం. నెల్లూరు జిల్లా ఆత్మగౌరవాన్ని, ప్రయోజనాలను కాపాడిన నాయకుడు జగన్ మోహన్ రెడ్డి అన్న కాకాణి. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులపై చంద్రబాబు ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారన్న కాకాణి. నెల్లూరు రైతాంగ ప్రయోజనాలే వైయస్ రాజశేఖర్ రెడ్డి లక్ష్యంగా పనిచేశారన్న కాకాణి. సోమశిల జలాల కోసం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ఎంతో కీలకమన్న కాకాణి. రాయలసీమ ఎత్తిపోతల పథకం, సాగునీటి లభ్యత, రాయలసీమ ప్రాజెక్ట్ వల్ల కలిగే ప్రయోజనాలు మరియు ప్రస్తుతం రైతాంగం ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించిన కాకాణి.

# శ్రీవారి సేవలో బొమ్మగోని చైతన్య గౌడ్

**-వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న కాంగ్రెస్ నేత**

**-పరమేశ్వర్ రెడ్డికి లడ్డు ప్రసాదం అందజేత**



**ఉప్పల్ :**
చిలకనగర్కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొమ్మగోని చైతన్య గౌడ్ ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానంలో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.అనంతరం స్వామివారి మహా ప్రసాదమైన లడ్డును కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డికి మర్యాదపూర్వకంగా అందజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెలకల మోహన్ రెడ్డి,ఆకిటి ఆగం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కన్నుమూసిన 102 పైలెట్... కుటుంబానికి భరోసా

**-రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేత**



**కీసర :**
విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ అనారోగ్యంతో అకాల మరణం చెందిన 102 అంబులెన్స్ పైలెట్ ఆనందరాజ్ కుటుంబానికి అత్యవసర వైద్య సేవల సంస్థ అండగా నిలిచింది. కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు సంస్థ తరపున రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు.గత నెలలో తీవ్ర అనారోగ్యానికి గురై ఆనందరాజ్ మృతి చెందగా, ఆయన కుటుంబానికి భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ సహాయాన్ని అందజేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. హైదరాబాద్లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధికారి సుధాకర్, మానవ వనరుల విభాగ అధికారి కిరణ్ కిషోర్ పాల్గొని చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ సంస్థలో పనిచేసే ప్రతి ఉద్యోగి కుటుంబ సభ్యుడితో సమానమని, ఆనందరాజ్ మరణం తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి ఇది తమ బాధ్యతగా అందిస్తున్న సహాయమని, భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి సంస్థ అండగా ఉంటుందని తెలిపారు.సంస్థ నిర్ణయంపై ఉద్యోగులు, మృతుని బంధువులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆపద సమయంలో అండగా నిలిచిన యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ కళాశాలలోని ఉజ్వల భవిష్యత్తు



**కోరుట్ల :**
ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గౌసుర్ రెహమాన్ అన్నారు. ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులు చేరేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు బుధవారం కోరుట్ల పట్టణ పరిసర గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పదో తరగతి పరీక్ష రాసి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇండ్లకు వెళ్ళి ప్రిన్సిపాల్ గౌసూర్ రెహ్మాన్ అధ్యాపకులు ప్రభుత్వ కళాశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలోనే అనుభవజ్ఞులైన అధ్యాపకులు విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య బోధన అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓ గంగా ప్రసాద్, అధ్యాపకులు ఇమ్రాన్ ఖాన్, హబీబ్, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, వంశీ, రాజు, శిరీష్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ జై భీమ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**ఉప్పల్**
ఉప్పల్ జై భీమ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గౌరవ సలహా దారులుగా డాక్టర్ బి. సత్తయ్య, బి.రా మయ్య , గౌరవ అధ్యక్షులుగా ఎర్ర బాల రాజు , అధ్యక్షులుగా రాపోలు రవీందర్, ఉపాధ్యక్షులుగా జోన్నపల్లి క్రాంతి రాజు , వి.వెంకటేశ్ మహారాజ్, ప్రధాన కార్యదర్శిగా మస్క ధన్ రాజు, కోశాధికారిగా ఏసురి బలపోచయ్య, సహాయ కార్యదర్శిగా ఆస్క సురేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా డి.సాయి ప్రసాద్, బొప్పెన శ్రీధర్ లు ఎన్నిక కాగా కార్యవర్గ సభ్యులుగా ఒక్కసు బలనార్సింహ, మస్క సుధాకర్, గుండే రాజు, మీసాల జం గయ్య ను ఎన్నుకోవడం

# 10వ తరగతి ప్రతిభావంతులకు ఎం ఆర్ అకాడమీలో ఘన సన్మానం



**రంగారెడ్డి :**
ఇటీవల విడుదలైన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఎం ఆర్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల కృషి, పట్టుదలతో పాటు వారి విజయానికి అండగా నిలిచిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సేవలను గుర్తిస్తూ ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించారు. విద్యార్థుల విజయాలను వేడుకగా జరుపుకోవడంతో అకాడమీ ప్రాంగణం ఆనందోత్సాహాలతో కళకళలాడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. ప్రభాకర్ చౌటి మాట్లాడుతూ, విద్యార్థి జీవితంలో పదో తరగతి ఒక కీలక మలుపని, ఈ దశలో సాధించిన విజయం భవిష్యత్ లక్ష్యాలకు బలమైన పునాదిగా నిలుస్తుందని అన్నారు. విజయాన్ని అందుకోవాలంటే కష్టపడి చదవడం మాత్రమే కాకుండా స్పష్టమైన లక్ష్యం, సమయపాలన, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం కూడా ఎంతో అవసరమని ఆయన విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి, దాన్ని సరైన దిశలో మలుచుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ప్రేరణాత్మకంగా వివరించారు. చదువుతో పాటు మంచి విలువలు, సామాజిక బాధ్యత కూడా అలవర్చుకోవాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా అకాడమీ యాజమాన్యం మాట్లాడుతూ, విద్యార్థుల విజయంలో ఉపాధ్యాయుల నిరంతర శ్రమ, తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల పట్టుదల సమానంగా కారణమయ్యాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత సామర్థ్యాన్ని గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ, సందేహ నివృత్తి తరగతులు, నిరంతర పరీక్షలు నిర్వహించడం వల్లే ఈ మంచి ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ మరింత ఉన్నత ఫలితాలను సాధించేలా కృషి చేస్తామని వెల్లడించారు.తల్లిదండ్రులు మాట్లాడుతూ, తమ పిల్లల విద్యాభివృద్ధికి ఎం ఆర్ అకాడమీ అందించిన మార్గదర్శకత్వం, క్రమబద్ధమైన బోధన, ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో అకాడమీ కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. తమ పిల్లల విజయానికి కారణమైన అకాడమీ యాజమాన్యం, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థుల విజయాన్ని చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేయగా, ఉపాధ్యాయులు గర్వంగా భావించారు. విజయోత్సాహం, అభినందనలు, ప్రేరణాత్మక సందేశాల మధ్య కార్యక్రమం ఘనంగా ముగిసింది. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో మరింత ఉన్నత విజయాలు సాధించాలని పలువురు ఆకాంక్షించారు.

# మాడుగులపల్లిలో పీఏసీఎస్ లూటీ అధికారుల ముసుగులో అధికార పార్టీ నేతల అరాచకం

**-తిప్పర్తి,సెట్టిపాలెం,పీఏసీఎస్ కేంద్రాల్లో రాజకీయ నేతల రాజ్యమేలు**

**-అధికారుల జాడ శూన్యం అధికార పార్టీ నేతలే అక్కడ సర్వం**

**-విసిగిపోయి కలెక్టర్కు ఫిర్యాదు చేసిన మాడుగులపల్లి మండల రైతులు**








**ప్రజావారధి**
మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ రాజకీయ రంగు పులుముకుంది రైతులకు సేవ చేయాల్సిన సహకార సంఘాలు, అధికార పార్టీ నేతల పాలిట కామధేనువులా మారాయి మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తిప్పర్తి, సెట్టిపాలెం, పీఏసీఎస్ ల తీరు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది ఈ కేంద్రాల్లో అధికారుల మాట దేవుడెరుగు అంతా అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల కనుసన్నల్లోనే కొనుగోళ్లు సాగుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాల్లో పీఏసీఎస్ సిబ్బంది, ఏఈఓలు ఉండి ధాన్యం సేకరణను పర్యవేక్షించాలి కానీ మాడుగులపల్లి మండలంలోని ఈ రెండు పీఏసీఎస్ల పరిధిలో అధికారులు ఎక్కడా కనిపించడం లేదు, వినిపించడం లేదు అంతా అధికార పార్టీ నాయకులే అధికారుల సీట్లలో కూర్చుని అనధికార ఏజెంట్లు గా చలామణి అవుతున్నారు ఎవరి ధాన్యం ముందు కొనాలి? ఎవరికి కోతలు పెట్టాలి? ఏ మిల్లుకు లోడ్ పంపాలి? అన్నది ఈ రాజకీయ నేతలే నిర్ణయిస్తుండటం దారుణం ముఖ్యంగా తిప్పర్తి, సెట్టిపాలెం పీఏసీఎస్ కేంద్రాల్లో సామాన్య రైతుకు చుక్కెదురవుతోంది పార్టీ అండ ఉన్న వారికి, నాయకుల అనుచరులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ కష్టపడి పండించిన సామాన్య రైతును వారాల తరబడి ఎండలో ఎండబెడుతున్నారు, తేమ శాతం పేరుతో రైతులను భయపెడుతూ, తరుగు తీయడంలోనూ ఈ నేతలు చక్రం తిప్పుతున్నారని, దీని వెనుక పెద్ద ఎత్తున కమీషన్ల దందా నడుస్తోందని ఆరోపణలు వస్తున్నాయి ఇంత జరుగుతున్నా స్థానిక యంత్రాంగంపట్టించు కోకపోవడంతో, మాడుగులపల్లి మండల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు కొనుగోలు కేంద్రాల్లో ఉండాల్సింది తూకం వేసే మిషన్లు, అధికారులు కానీ ఇక్కడ రాజకీయ పార్టీ జెండాలు మోసే నాయకులు శాసిస్తున్నారు అని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తిప్పర్తి, సెట్టిపాలెం పీఏసీఎస్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి కొనుగోలు కేంద్రాల పరిసరాల్లో అనధికార వ్యక్తులు, రాజకీయ నాయకులు ఉండకుండా కఠిన చర్యలు తీసుకోవాలి అధికారుల విధుల్లో జోక్యం చేసుకుంటున్న వారిపై కేసులు నమోదు చేసి, రైతులకు న్యాయం చేయాలని మండల రైతాంగం డిమాండ్ చేస్తోంది.

# బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి.

**కోరుట్ల సీఐ కే.లక్ష్మీనారాయణ**





**కోరుట్ల:**
ప్రజలందరూ కలిసి మెలిసి శాంతియుతంగా బక్రీద్ పండుగ జరుపుకోవాలని కోరుట్ల సీఐ కె.లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక వాసవి కళ్యాణ మండపంలో కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి మండలాలకు చెందిన బిజెపి ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ కే.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మే 27వ తేదీన బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. నిబంధనల మేరకు పోలీసులకు సహకరించాలని అన్నారు. కోరుట్ల మత సామరస్యానికి ప్రతీకగా కొనసాగుతున్నదని అన్నారు. ఏమైనా సమస్యలుంటే డయల్ 100కిగాని, స్థానిక పోలీసులకు గాని తెలియజేయాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తును పటిష్టం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎస్సై ఎం.చిరంజీవి, రామచంద్రం, మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు..

# శ్రీవిజయ గణపతి వార్షికోత్సవంలో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి




**ఉప్పల్**
బీరప్ప గడ్డ డివిజన్ రాఘవేంద్ర కాలనీలో శ్రీ విజయ గణపతి దేవాలయం 25వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి,ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు టీజీ గౌడ్,చారి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆకిటి ఆగం రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రాజేష్ ముదిరాజ్, మహేందర్ ముదిరాజ్, చైతన్య, అమర్, పల్లె రమేష్ గౌడ్,జగదీష్, జంగయ్య, శంకర్, సత్యం, సోను గౌడ్, ఎడ్ల అంజయ్య, పిట్టల సాయిలు, రాము గౌడ్, ఫహీమ్,వంశీ,కాలనీ వాసులు ,పాల్గొన్నారు

## గుంపెన సొసైటీ అధ్యక్షులుగా పదవి బాధ్యతలు స్వీకరించిన బోయినపల్లి సుధాకర్ రావు....

**వైస్ చైర్మన్ వెంకట నారాయణ పాలకవర్గం డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు,**



**అన్నపురెడ్డిపల్లి :**
అన్నపురెడ్డిపల్లి పైసా సహకార సంఘం అధ్యక్షులుగా బోయినపల్లి సుధాకర్ రావు, వైస్ చైర్మన్ గా వెంకట్ నారాయణ, పాలకవర్గం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఆనంద్, సొసైటి సీఈఓ శ్రీనివాస్, మామిళ్ళపల్లి రామారావు, కొత్తూరు వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ నరసారెడ్డి, సన్నేపల్లి సుధాకర్, చల్లా రాంబాబు, పెద్ద గౌండ్ల పుల్లారావు, షేక్ రహమత్, కోటగిరి బుజ్జి, మామీలపల్లి లక్ష్మణరావు, బొల్లంపల్లి ప్రవీణ్, సుధీర్, నున్న గోపాలరావు, పోట్రూ రాంబాబు, సడియం వెంకటేశ్వర్లు, లాకవత్ కృష్ణ, మంద ప్రదీప్, సంఘ రైతులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ రమాదేవి**



**సుజాతనగర్ :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన బాదావత్ శ్రీను, S/o గోరియా, వయసు 45 సంవత్సరాలు, అను వ్యక్తి సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు తన ఇంటి నుంచి బయలుదేరి ఊరి వెనక ఉన్న నిమ్మలకుంట చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో చెరువు కట్టమీద అతని బట్టలు చెప్పులను అతని కుటుంబ సభ్యులు గమనించి పోలీసువారికి సమాచారం అందించారు. అదే రాత్రి సుజాతనగర్ ఎస్ఐ రమాదేవి, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, తో కలిసి చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం తెల్లవారుజామున 6 గంటలకు శ్రీను, చనిపోయి చెరువులో తేలాడు. అని తెలిపారు. బాదావత్ శ్రీను నిమ్మలకుంట చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయి చనిపోయి ఉంటాడని అతని భార్య బాదావత్ శారద, ఇచ్చిన దరఖాస్తు మేరకు సుజాతనగర్ ఎస్సై రమాదేవి, కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు. ఉన్నారని తెలిపారు.


## శిక్షణ పూర్తి చేసుకున్న స్వశక్తి మహిళలకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ



**రామగుండం,మే 5 :**
మహిళలు తాము ఎంచుకున్న రంగంలో ఎదిగేందుకు ఆ రంగంలో వస్తున్న మా ర్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ తమ నైపుణ్యాశీ పెంపొందించుకోవాలని అదన పు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) ,రామ గుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ అన్నారు.విధ్యార్థుల యూనిఫామ్ కుట్ట డంలో నైపుణ్యం పెంపొందించడానికి మెప్మా,ఎ పి ప్రొడక్టివిటీ కౌన్సిల్ సంయుక్త ఆద్వర్యంలో జమ్మికుంట లో నిర్వహించిన శిక్షణా కేంద్రంలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న యాభయ్ మంది స్వశక్తి మహిళలకు రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో మం గళవారం నిర్వహించిన కార్యక్రమంలో దృవీకరణ పత్రాలు పంపిణీ చేశారు.ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ టైలరింగ్ వృత్తిలో ఉన్న మహిళలను గుర్తించి వృత్తి నైపుణ్యం మెరు గుపరచడానికి ఈ శిక్షణ ఇవ్వడం జరిగిందని,శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు యూని ఫామ్ కుట్టడానికి ఆర్డర్ ఇవ్వడంలో ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపా రు.అర్హత ఉన్న స్వశక్తి మహిళలు వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవడానికి అవసరమైన సహకారం మెప్మా ఆధ్వర్యంలో ఆద్వర్యంలో ఉచితంగా అందిస్తామని,కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో రామగుండం నగర పాలక సంస్థ సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి,మెప్మా టి ఎం సి మౌనిక,సి ఓ లతో పాటు ఎ పి ప్రొడక్టివిటీ కౌన్సిల్ కో ఆర్డినేటర్ శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సాంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటలు సాగు చేయాలి...

- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని అధిక దిగుబడులు సాధించాలి....
- పంటల విభిన్నీకరణ, ప్రత్యామ్నాయ సాగుతోనే రైతులకు ఆర్థిక భరోసా...
- నీటి సంరక్షణ పద్ధతులు, మిశ్రమ పంటల సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలి.....
- ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు



**కొత్తగూడెం :**
రైతులు కేవలం సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటల సాగును విస్తరించుకోవాలని ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని భువన గార్డెన్స్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, రెండవ రోజు "ఉద్యాన పంటల సాగు"పై నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పంటల విభిన్నీకరణ అత్యంత ఆవశ్యకమని, మార్కెట్ డిమాండ్కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని సూచించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ ఆటోమేషన్, సిరికల్చర్, ఆయిల్ పామ్ స్టాళ్లను ఆయన పరిశీలించి, ఆధునిక పద్ధతులపై ఆసక్తిగా ఆరా తీశారు. నీటి సంరక్షణ పద్ధతులు పాటించడం వల్ల సాగు ఖర్చు తగ్గి లాభాలు పెరుగుతాయని, వాతావరణ మార్పులను తట్టుకునే పంటలపై అవగాహన కలిగి ఉండాలని రైతులకు హితవు పలికారు. నిపుణులు వివరించిన సాగు మెళకువలను పాటించి రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆయన కోరారు. ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంపుదల వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు క్షేత్రస్థాయిలో వివరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి జె. కిషోర్, ఉద్యాన అధికారి డి. దేవప్రసాద్, హెచ్.ఈ.ఓ వసంత, టిపిసిఎస్ అధ్యక్షులు మండే హనుమంతరావు, ఏ.ఓలు, ఏ.ఈ.ఓలు, రైతులు పాల్గొన్నారు.



## బాలికల ఆరోగ్యం వ్యాధి నిరోధక టీకాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి...

**జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రతాప్..**



**అన్నపురెడ్డిపల్లి**
నేడు 'ఆశా డే' సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (PO MCHI) డాక్టర్ ప్రతాప్, అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (PHC) సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు ఆరోగ్య సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

**సమావేశంలోని ముఖ్య అంశాలు**

**కౌమార బాలికల ఆరోగ్యం - HPV వ్యాక్సిన్**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్న పథకాలపై డాక్టర్ ప్రతాప్ సమీక్షించారు. ముఖ్యంగా కౌమార దశలోని బాలికల సాధికారత ఆరోగ్య పరిరక్షణపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. 14 ఏళ్లు నిండి 15 ఏళ్ల లోపు ఉన్న బాలికలందరికీ HPV వ్యాక్సిన్ (గర్భాశయ క్యాన్సర్ నివారణ టీకా) అందేలా చూడాలని, దీనిపై తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు.

**2. క్యాచప్ (CATCH UP) ప్రోగ్రామ్**

రెండు సంవత్సరాల లోపు పిల్లల్లో ఎవరైనా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోకుండా మిగిలిపోయి ఉంటే, వారిని గుర్తించి టీకాలు వేయించడం ఆశా ఆరోగ్య



కార్యకర్తల బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం ఈ నెల నుండి జూలై వరకు ప్రత్యేకంగా నిర్వహించే 'క్యాచప్ ప్రోగ్రామ్' ను సమర్థవంతంగా అమలు చేయాలని, ఏ ఒక్క బిడ్డ కూడా టీకా తీసుకోకుండా మిగిలిపోకూడదని పిలుపునిచ్చారు.

**3. సరైన వయసులో వివాహం మాతాశిశు ఆరోగ్యం**

తల్లి పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే సరైన వయసులో వివాహం జరగడం అత్యంత ముఖ్యమని డాక్టర్ ప్రతాప్ తెలిపారు. అమ్మాయికి 21 ఏళ్లు అబ్బాయికి 25 ఏళ్లు దాటిన తర్వాతే వివాహం చేసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎర్రగుంట వైద్యులు డాక్టర్ మనోజ్, నాగభూషణం, వాణి, డీపీఎం ఓ వెంకటేశ్వర్లు, ఎస్తేర్ రాణి, జయలక్ష్మి, ప్రకాశరావు, ఇతర ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్యాంకులు,ఏటీఎంలలో భద్రత కట్టుదిట్టం

**:- అనుమానితులపై ప్రత్యేక నిఘా**

**రామగుండం,మే 5 :**
ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి గోదావరిఖని సబ్డివిజన్ పరి ధిలోని బ్యాంకులు మరియు ఏటీఎం కేంద్రాల్లో విస్తృత తని ఖీలు నిర్వహించబడినట్లు గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ తెలిపారు.ఆయన పర్యవేక్షణలో గోదావరిఖని1, 2 టౌన్, రామగుండం సర్కిల్,మంథని సర్కిల్ పోలీస్ స్టేషన్ల పరిది ,లోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ బ్యాంకులు,ఏటీఎం కేంద్రాల్లో పోలీస్ అధికారులు తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీలలో గోదా వరిఖని1 టౌన్ ఇన్స్పెక్టర్లు ఇంద్రసేనారెడ్డి,ఆఫ్జలోద్దీన్,2 టౌన్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ రావు,మంథని సీఐ రాజు,రామగుండం సీఐ కృష్ణకుమార్లు,మరియు ఎస్ఐలు పాల్గొన్నారు.ఈ తనిఖీల సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి వారి వివరా లను సేకరించారు.నేర నియంత్రణలో భాగంగా బ్యాంకులు మరియు ఏటీఎం కేంద్రాల్లో అలారం వ్యవస్థలు సక్రమంగా



పనిచేస్తున్నాయో లేదో పరిశీలించాలని,హై రిజల్యూషన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అవి నిరంతరం పనిచేసేలా చూసు కోవాలని సూచించారు.సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను కూడా పరిశీలించారు.ఏదైనా నేరం జరిగినప్పుడు సీసీ కెమె రాల ద్వారా నిందితులను సులభంగా గుర్తించవచ్చని,అలాగే అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడానికి వీటి ఉప యోగం ఎంతో ఉంటుందని పోలీస్ అధికారులు బ్యాంకు నిర్వాహకులకు తెలిపారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బ్యాంకుల భద్రత కోసం సీసీ కెమెరాలు, అలారం వ్యవస్థలు,సరిపడా లైటింగ్, సెక్యూరిటీ గార్డుల ఏర్పాటు వంటి భద్రతా చర్యలను



పటిష్టంగా అమలు చేయా లని సూచించారు.బ్యాంకు ఆవరణ మొత్తం కవరయ్యేలా కెమె రాలు ఏర్పాటు చేయాలని,స్ట్రాంగ్ రూమ్ భద్రతను కచ్చి తంగా పాటించాలని తెలిపారు.అలాగే బ్యాంకులకు వచ్చే కస్టమర్లలో ఎవరైనా అనుమానాస్పదంగా ఎక్కువసేపు ఉన్నట్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.బ్యాంకు నుండి నగదు ఉపసంహరించుకుని వెళ్లే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా కస్టమర్లకు అవగాహన కల్పించాలని బ్యాంకు అధికారులకు సూచించారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co